RSVMAIA 126
C

ఓం

# గ్రంథాలయసర్వస్వము

ఆంధ్రదేశ గ్రంథాలయసంఘపక్షమున ప్రకటింపబడు సచిత్రమాసపత్రిక.

సంపుటము ౬ ] డిశంబరు, ౧౯౨౫ [ సంచిక ౬

సంపాదకుడు: అయ్యంకి వేంకటరమణయ్య.

## విషయసూచిక


| | | |
|---|---|---|
| ౧ | ఐదవ పుదుక్కోట గ్రంథాలయమహాసభ | ౧౫౧ |
| ౨ | భారతవర్షమునందలి ప్రాచీన సరస్వతీభాండారములు: | |
| | ౧ భారతవర్షముయొక్క యైశ్వర్యము | ౧౫౪ |
| | ౨ భారతవర్షమునందలి ప్రాచీనభాండారములు | ,, |
| ౩ | వివిధవిషయములు | ,, |
| ౪ | గ్రంథాలయ ఉపయోగములు | ౧౫౮ |
| ౫ | జర్మను గ్రంథాలయములందు సహకారము | ౧౫౯ |
| ౬ | రాజకీయ ప్రాచ్యలిఖిత గ్రంథాలయదుఃస్థితి | ౧౬౦ |
| ౭ | చతుర్థగంజాంమండలగ్రంథాలయమహాసభ, కళింగపట్నం | ౧౬౨ |
| ౮ | నైజాంరాష్ట్ర గ్రంథాలయసభ | ౧౬౩ |
| ౯ | గ్రంథాలయ ప్రయోజనము | ౧౬౪ |
| ౧౦ | నైజామురాష్ట్రమందలి ఆంధ్రగ్రంథాలయములు | ౧౬౫ |


---

వార్షికమూల్యము రు ౩-౦-౦

విడిసంచిక వెల రు ౦-౪-౦.

c I

# జడకుచ్చులు

సుప్రసిద్ధాంధ్ర కవులగు

## రాయప్రోలు సుబ్బారావు

గారి నూతన గ్రంథము

వెల రు **1—0—0** మాత్రమే


| | | |
|---|---|---|
| ...మామి. | పూజ. | కోయిల. |
| ...డా ! | విరహాపేక్ష. | కనకము |
| ...్రమాత. | పిలుపు. | ధ్యానిబుద్ధప్రతిమ. |
| ...ధము. | మధుమాలి. | కవిత. |
| ...కము. | గీతాం దేహి. | ఆచారక్షయము. |
| ...తము. | ప్రవాసరాధిక. | ఒకమాట. |
| ... | సఖీసంవరణం. | రాధపిలుపు. |
| ...తవికాసము. | మేఘము. | తిలకము. |
| ...చైత్రము. | ఎవరు ? | రామలింగారెడ్డి. |
| ...వు. | | కలియుగార్జునుడు. |

అను విషయములమీఁది పద్యము లిందు గలవు.

వలయువారిట్లు వ్రాయవలెను :—

ఆంధ్ర పరిషత్తు : బెజవాడ

పుదుక్కోట గ్రంథాలయ మహాసభ



పరబ్రహ్మాత్మికాం దేవీం ♦ భుక్తిముక్తి ఫలప్రదాం
ప్రణమ్య స్తౌమి తామేవ ♦ జ్ఞానశక్తిం సరస్వతీం.

ఆరవ సంపుటము.

# గ్రంథాలయసర్వస్వము

ఆరవ సంచిక.

## ఐదవ పుదుక్కోట గ్రంథాలయ మహాసభ

(అధ్యక్షులగు సూరి వేంకటనరసింహశాస్త్రిగారి ఉపన్యాసము)

గ్రంథాలయసంఘ వార్షికసభయందు గ్రంథాలయ పరిపాలనకు సంబంధించిన సాంకేతిక విషయములనుగూర్చి చర్చించుట సహజము. అయితే మనమింకను ఉద్యమమున నలుదెసలను ప్రచారణ చేయవలసియున్నది. గ్రంథాలయములవలన కలిగెడి అనేక లాభములు ప్రజాసామాన్యమునకు స్పష్టముగా బోధపడలేదు. దేశము నిరంతర కాంక్షతో వాంఛించుచున్న జాతీయవిద్యావిధానమున గ్రంథాలయముల యుచితస్థానము ఇంకను నిరూపింపవలసియున్నది. గ్రంథాలయములు కేవల గ్రంథములను భద్రపరచు స్థానములు మాత్రమేగాక జాతిమత వృత్తి వయోవిచక్షణ లేకుండ జనసామాన్యమునందలి అన్నివ్యక్తులకును సౌభాగ్యము సమకూర్చునదిగా నుండ నగునని ప్రజలింకను పూర్ణముగా గ్రహించలేరు. అన్ని తరగతుల ప్రజలు సమానస్కంధులుగా ఏకత్ర సమావేశమై ఓర్పు, సహజము, మొదలగు పౌరవిధులను అలవడచేసుకొనుటకు గ్రంథాలయము తగిన కేంద్రస్థానమను విషయమునకు తగిన ప్రాముఖ్యత ఇంకను జనసామాన్య మిచ్చుటలేదు. మనదేశము ప్రాచీనకాలము నుండియు నాగరికతనొందినదని మనమెంత విఱ్ఱవీగువారమైనను ఈడుమీరినవారి విద్యాభివృద్ధికొరకు వర్తమానకాలమందు మనమేమియు కృషిచేయుచుండుటలేదు. గ్రంథాలయములు సుస్థాపితములైనచో ఈపనిని మిక్కిలి జయప్రదముగా జరుపగలమను విషయము నిప్పుడిప్పుడే మనవిద్యాధికులు గ్రహించుచున్నారు. విద్యాదానమొనర్చు ప్రతిష్ఠాపనలకును దన్యోన్య సహకారభావమును నెలకొల్పుట ముఖ్యావసరమనియు, గ్రంథాలయముల మూలమున అట్టిపని సమకూడుననియు ఇంకను మనదేశస్థులు తెలుసుకొనవలసియున్నది. ఏ గ్రామమందున్న విద్యార్థియైనను నగరములయందు నెలకొల్పబడియున్న ఉన్నత గ్రంథాలయములయందుండెడి ఉద్గ్రంథములను తగిన బందోబస్తులతో తెప్పించి చదువుకొనుట కర్హుడను రహస్యము మనదేశమున బహుకొలదిమందికి గాని తెలియదు. ఇంకను ధర్మగ్రంథాలయమతము మనదేశమున వ్యాప్తి చెందనేలేదని స్పష్టముగా చెప్పవచ్చును. ఈయంశము లన్నియు ప్రజాసామాన్యము స్పష్టముగా తెలుసుకొని అనుభవములోనికి తెచ్చినగాని "గ్రంథాలయము సామాన్యప్రజల విశ్వవిద్యాలయము" అను లోకోక్తి కేవలగ్రంథస్థముగానే యుండగలదు గాని ప్రజల నిత్యజీవనమందు

దానికి వ్యాప్తికల్గనేరదు. కాబట్టి ఇట్టిసభలయొక్క ముఖ్యోద్దేశము సర్వతోముఖమగు ధర్మగ్రంథాలయము యొక్క పరమప్రాప్యములేవో ప్రజలకుబోధించి వానిని ఆచరణలోనికి తెచ్చువిధానములను నిరూపణచేయుటయే యని నేను మనవిచేయుచున్నాను. అట్లుచేసినగాని గ్రంథాలయములేని పట్టణముగాని పల్లెగాని యుండకూడదనియు గ్రంథాలయోపయోగమును పొందని పురుషుడుగాని, స్త్రీగాని, బిడ్డగాని యుండకూడదనియు మన యుద్యమమునయొక్క పరమప్రాప్యము కార్యాచరణకు రాదు.

ప్రథమమున మన స్వదేశమందును పరదేశములయందును పూర్వమున్నట్టియు ప్రస్తుతము పనిచేయుచున్నట్టియు గ్రంథాలయములనుగూర్చి సంగ్రహముగా పరిశీలింతము. సనాతనమగు ఈ భారతవర్షమున గ్రంథాలయములు ప్రాచీనకాలమునుండియు నెలకొల్పబడి వర్ధిల్లుచుండెను. ఆదికాలమున జ్ఞానము గ్రంథస్థముగాక వాగ్రూపమున ఒకరినుండి మరియొకరు నేర్చుకొనుచుండిరి. ఆకాలపు బ్రహ్మర్షులును రాజర్షులును ఒక్కొక్కరు ఒక్కొక్క సంచారగ్రంథాలయముగా నుండిరి. వారు సంచరించిన వాతావరణమంతటను తమ తపోధనముచే సముపార్జనచేసిన తేజోపుంజమూలమున కాంతిని వెదజల్లుచు అజ్ఞానతిమిరమును పారద్రోలుచుండిరి. లిపి ఏర్పడినపిదప అనేకరకములగు వస్తువులతో గ్రంథములేర్పడుచుండెను. ఈగ్రంథములు ఆకాలమున హస్తలిఖితములుగా నుండెను. ఈలిఖితగ్రంథములు మిక్కిలి శ్రద్ధతోను ప్రయాసతోను తయారుకాబడుచుండెను. ప్రథమమున ఇట్టి లిఖితగ్రంథములు బౌద్ధవిహారములయందును దేవాలయములయందును ప్రత్యేకముగా భద్రపరుపబడుచుండెను. బౌద్ధయుగములో బౌద్ధవిహారము లన్నిటియందును గ్రంథములు భద్రపరుపబడుచుండెననియే చెప్పవచ్చును. గ్రంథములను లిఖించుట, వానిని భద్రపరచుటయు బౌద్ధసన్యాసుల విధ్యుక్తధర్మములలో అగ్రగణ్యము. ఫాహియానుయను చైనాదేశపు బాటసారి భారతదేశ సంచారమునుగూర్చి వ్రాసిన గ్రంథములో లిఖిత గ్రంథములను గూర్చియు వానిని భద్రపరచు విహారములను గూర్చియు పేర్కొనియున్నాడు. ఆకాలమున లిఖితగ్రంథములు వ్రాయుటకును, భద్రపరచుటకును వారెంత కష్టపడిరో ప్రకృతిశక్తుల సాధనముల మూలమున శీఘ్రకాలమున లక్షగ్రంథములను ముద్రించగల్గు సావకాశముగల ఈకాలపువారు గ్రహించుట కొంచెముకష్టమైనపని. మనకు చరిత్రసిద్ధముగ లభించుగ్రంథాలయములను గూర్చిన యుదంతము లలో మొదటిది నలందా విశ్వవిద్యాలయమునుగూర్చియు గ్రంథాలయమునుగూర్చియు. ఇది చైనాదేశపు యాత్రాపరుల గ్రంథములయందు లభించుచున్నది. నలందా విశ్వవిద్యాలయమున గ్రంథములు తొమ్మిది అంతస్తులుగల "రత్నోదధి"యని పేరుగన్న మహాసౌధమున భద్రపరచబడియుండెను. ఈ గ్రంథాలయము క్రీస్తుశకము 8 వ శతాబ్దమున నాశము పొందింపబడినది. పిమ్మట బంగాళాదేశ ప్రాంతమును పరిపాలనచేసిన పాలవంశపు రాజులు విక్రమశిల, ఓదంతపురియను గ్రంథాలయములను స్థాపించి అభివృద్ధికి తెచ్చిరి. ఇవికూడ కాలచోదితములై భక్త్యారుకిలిజీయను యవనునిచే క్రీస్తుశకము 13వ శతాబ్దమున నాశము పొందించబడినది. ఇప్పుడు ఈ గ్రంథాలయముల యందుండు కొందరు బౌద్ధసన్యాసులు అమూల్యమగు గ్రంథములు కొన్నిటిని సంగ్రహించి నేపాళదేశమునకు పారిపోయి అచ్చట తలదాచుకున్నట్లు చరిత్ర చెప్పుచున్నది. ఈ బౌద్ధగ్రంథాలయములతోపాటు సనాతనార్యమతగ్రంథములను భద్రపరచు గ్రంథాలయములు హిందూ దేవాలయములయందును రాజమందిరములయందును సుస్థాపితములై ప్రవృద్ధినొందుచుండెను. గ్రంథాలయములకు గ్రంథదానముచేయుట మిక్కిలి పుణ్యప్రదమని పురాణములు ఘోషించుచున్నవి. బౌద్ధజైన మతగ్రంథములును యట్లే చాటుచున్నవి.

బౌద్ధగ్రంథాలయములు నశించినట్లు మనదేశీయుల అదృష్టవశమున జైనగ్రంథాలయములు నష్టమైపోక ఇప్పటికిని మంచిస్థితిలోయున్నవి. అందు బొంబాయి రాజధానిలోచేరిన సూరటు, క్యాంబే, అహమ్మదుబాదు నగరములందున్న జైనగ్రంథాలయములు మిక్కిలిప్రఖ్యాతినిగాంచినవి. ఇవి యన్నియు మధ్యయుగమున ప్రారంభమైనవి. వీనియన్నిటియందును కాగితపు అట్టలతో చేయబడిన పెట్టెలలో లిఖితగ్రంథములు భద్రపరుపబడుచుండెను. జైనసన్యాసులు ఈగ్రంథములు వ్రాయుటకును భద్రపరుచుటకును మిక్కిలి శ్రద్ధతీసుకొనుచుండిరి. పఠానువంశీయులు, మొగలు వంశీయులునగు మహమ్మదీయ చక్రవర్తులు భరతవర్షమును పాలించిన కాలమున రాజమందిరములయందు అమూల్యములగు గ్రంథసమూహములతో నిండిన ఉన్నతగ్రంథాలయములు నెలకొల్పబడి రాజసన్మానమునొందిన విద్వాం

నుల యధీనమున మిక్కిలి ప్రసిద్ధిగాంచియుండెను. ఫిగోజిపానగరకోట యను దేవాలయమును ముట్టడించినపుడు ఆ దేవళమున భద్రపర్చబడియున్న సంస్కృతగ్రంథములను ఆ మహారాజు తన రాజధానికి తెచ్చి వానినన్నిటిని రాజభాషలోనికి తర్జుమా చేయించి ప్రచురించెను. హుమాయూను, అక్బరు, జహంగీరును విద్యాభివృద్ధి చేయుట యందును విద్వాంసుల పోషణయందును మిక్కిలి శ్రద్ధాళువులై యుండిరి.

మహమ్మదీయ మహాయుగము హిందూదేశమున స్థాపితమై మహమ్మదీయ ప్రభువుల పరిపాలనలో చేరిన చిన్నరాజ్యములు కూడ విద్యాపోషణయందు వన్నెకెక్కినవి.

గుప్తవంశము అవసానము పొందినపిదప స్థాపితమైన చిన్న హిందూరాజ్యము లన్నిటియందును గ్రంథాలయములు విరివిగా స్థాపింపబడియుండెను. ధారానగరమున రాజ్యము చేసిన భోజునిచే స్థాపితమైన గ్రంథాలయము ఇందుమిక్కిలి ప్రాముఖ్యత చెందినది. ధారానగరమును చాళుక్యులు జయించినపిదప అచ్చటి గ్రంథాలయమందలి గ్రంథములను చాళుక్యులు తెచ్చి తమ రాజధానీనగరమున స్థాపితమైయున్న గ్రంథాలయమున భద్రపర్చిరి. ఈ చాళుక్య వంశరాజులలో విశాలదేవుడను వాడు మిక్కిలి ప్రసిద్ధికెక్కినవాడు. ఈయన కాలములో సంగ్రహింపబడిన మహాభారత గ్రంథసంచికనుండి తయారు చేయబడిన (మహాభారత) లిఖితగ్రంథము ఇప్పటికిని జర్మనీదేశమందలి "బాను" అనునగరమున విశ్వవిద్యాలయమున యున్నది. ఇప్పటికిని ఆల్వారు, బికనీరు జమ్ము, మైసూరు, నేపాలు మొదలగు సంస్థానముల మహారాజులు ఉన్నతమగు గ్రంథాలయములను పోషించుచు ఆయాగ్రంథాలయముల యందు భద్రపరుపబడియున్న గ్రంథములకు విభజనపట్టికలను ప్రచురించియున్నారు. తంజావూరు రాజమందిరమున నాటికి నేటికికూడ చూచు వారందరికి అచ్చెరువును గొల్పుచున్నది సరస్వతీవిలాసమను ఉద్గ్రంథాలయము. ఇందలి గ్రంథములకు విభజన పట్టికను తయారు చేయుటకు దొరతనమువారిచే నియమింపబడిన బర్నెలుగారు దానినిగూర్చి ఇట్లు వాక్రుచ్చియున్నారు:—"ఈగ్రంథాలయము యందున్న లిఖిత గ్రంథములసంఖ్యను బట్టిచూచిన ప్రపంచమందలి గ్రంథాలయములన్నిటిలో ఇదియె అగ్రగణ్యమని చెప్పక తప్పదు". ఈగ్రంథాలయము దక్షిణప్రాంతములను క్రీస్తుశకము 16, 17 శతాబ్దములలో పరిపాలించిన తెలుగు నాయక వంశపురాజులు ప్రథమములో స్థాపించిరి. ఈవిషయము ప్రతియాంధ్రునకు గౌరవావహముగదా! పిమ్మట 18వ శతాబ్దమున మహారాష్ట్రులు దీనినిమిక్కిలి యభివృద్ధికి తెచ్చిరి. ఇప్పటికిని 11 భాషలలో లిఖింపబడిన 18000 లిఖితగ్రంథములు ఇందున్నవి ఆధునిక కాలమున రాజధాని నగరముల స్థాపింపబడి ప్రవృద్ధినొందుచున్న క్యానిమరా గ్రంథాలయమునంటి ప్రతిష్ఠాపనలను మనము చూచుచున్నాము. జిల్లాముఖ్యపట్టణముల యందును ఇతరనగరములయందును ఇప్పటికాలమున నూతనముగా స్థాపింపబడి సారస్వతసంఘములను గాని వ్యాయామసంఘములను గాని అనుబంధములగు గ్రంథాలయము లెన్నియో మనదేశమున గలవు. పూనా నగరమందు స్థాపింపబడి ప్రవృద్ధిగాంచుచున్న "హిందూ దేశసేవకసంఘ గ్రంథాలయము" "భాండార్కరు విమర్శన కార్యాలయ గ్రంథాలయము" ఆధునిక కాలమున అత్యున్నత నాగరికతను పొందిన దేశములకు కూడ అలంకారములుగా నుండునొప్పును.

నవ్యభారతవర్ష యుగమున అభివృద్ధిమార్గానుసరణముగ గ్రంథాలయములను స్థాపించి అభివృద్ధికి తెచ్చుచున్నది బరోడా సంస్థానాధీశులగు శాయాజీ గాయక్వారు మహాప్రభువు. ఆ శ్రీమంతులు పాశ్చాత్యదేశములందు విరివిగా సంచారము చేయుచున్నపుడు ఈయుద్యమమూలమున ఆదేశపుబ్రజలు పొందుచున్న యమూల్యజ్ఞానసంపత్తిని యారసి తమరాష్ట్రమునగూడ ఆదేశపు విధానముల ననుసరించ ఈయుద్యమమును స్థాపించి భరతవర్షమునకంతకును మార్గదర్శకులైరి. ఇందుకొరకై వారు అమెరికానుండి 1911 సంవత్సరమున బోర్డెను అను గ్రంథాలయ శాస్త్రపండితులను రావించి వారి యాజమాన్యము క్రింద తమ రాజధానీనగరమున కేంద్ర గ్రంథాలయ ప్రతిష్ఠాపనను శ్రీవారు నెలకొల్పిరి. ఈ ప్రతిష్ఠాపన కంగములుగ జిల్లా గ్రంథాలయములు, పట్టణగ్రంథాలయములు, పల్లెటూరు గ్రంథాలయములు సంచారగ్రంథాలయములు యంత్రసహాయమున నేయు ప్రదర్శనమూలమున జ్ఞానాభివృద్ధి నొందించు ప్రతిష్ఠాపనలు మున్నగు శాఖలనెన్నియో స్థాపించి తన్మూలమున వారి రాష్ట్రమునం దంతటను జ్ఞానము గాయక్వారుగారు వెదజల్లిరి. పుదుక్కోట రాష్ట్రమున గ్రంథాలయోద్యమము చేయుచున్నపని ఆ సంస్థానపు ప్రజలకు కరతలామలకమే గద. తిరువాన్కూరు సంస్థానమున, ఆ సంస్థానపు రాజధానీనగరమున స్థాపింపబడియున్న

గ్రంథాలయము మూలమున ఉద్యమము వ్యాప్తినొందుచున్నది. ప్రభుత్వమువారు అచ్చట చిన్నిచిన్ని గ్రంథాలయములకు ధనసహాయము చేయుచున్నారు. మహారాష్ట్రదేశమున అచ్చటచ్చట స్థానికులు స్థాపించిన గ్రంథాలయములు పెక్కులుగలవు. వీని నన్నిటిని ఏకముఖమునకు తెచ్చి అన్యోన్యసహాయకములుగా చేయుటకై పూనా నగరమున కేంద్రసంఘము స్థాపింపబడి చక్కగా ఆప్రాంతమున ఉద్యమము అభివృద్ధి నొందుచున్నది. మైసూరు ఇందూరు సంస్థానాధీశులు కూడ తమ రాష్ట్రములయందు ఉద్యమమును చేపట్టి శ్రద్ధతో అభివృద్ధికి తెచ్చుచున్నారు. ఆంధ్రరాష్ట్రమున 1880 సంవత్సరము ఆప్రాంతమున ఈ యుద్యమమునకు విత్తునాటబడి తదాది ఈ యుద్యమము కొలదిగనో గొప్పగనో కృషి సేయుచు ఇప్పటికి కొంతవరకు దృష్టిగోచరమగు యభివృద్ధిని గాంచినదని చెప్పవచ్చును. అప్పుడప్పుడు జరిగెడి మండల తాలూకా రాష్ట్రీయసభల మూలమున ఉద్యమమున కృషిచేయువారు ఏకత్ర సమావేశమై ఉద్యమాభివృద్ధి మార్గముల నన్వేషించి కార్యాచరణకు తెచ్చుచున్నారు. ఇతర దేశములలో ఈ యుద్యమమును గూర్చి జరుగుచున్న కృషినిగూర్చి ముచ్చటించవలసినపుడు ఇందగ్రస్థానము వహించిన అమెరికా ఖండమున జరుగు పనినిగూర్చి ముందు ప్రశంసించవలసియున్నది. ఈ యుద్యమమున కృషిచేయువారచ్చటచ్చట తఱుచు సభలను జరిపి ఉద్యమ నిర్వహణవిధానమును నిర్ణయించి కార్యాచరణకు తెచ్చుచుందురు. ఈ ఉద్యమ నిర్వహణమందు పాండిత్యము వహించిన విద్వాంసులు ఇందును గూర్చి సర్వతోముఖమగు వ్యాసములను వార్తాపత్రికలయందు ప్రచురింతురు. విద్యార్థులు విలాసముకొరకు సెలవుదినములలో ప్రయాణములకు వెళ్లినపుడు వారలతో గ్రంథాలయములనుండి విద్యాధికులు పంపబడుదురు. వీరు విద్యార్థులు విశ్రాంతిని పొందుకాలమున వారలవద్దకు పోయి విద్యార్థులు గ్రహించెడి విషయములనుగూర్చి వారలకు ఉపన్యసించి ఉపన్యాసాంతమున తాముపన్యసించిన విషయమునుగూర్చి విపులముగా వివరింపబడిన గ్రంథనామములను పేర్కొని ఆగ్రంథములను తమకు పంపిన గ్రంథాలయమున దొరకునని చెప్పుదురు. గ్రంథాలయములకు విరివిగా ప్రజల నాకర్షించుటకు ఎక్కువ సభ్యులుగల 'క్లబ్బు' లుపయోగించుకొనుటకు గ్రంథాలయమందలి ప్రత్యేకపు గదులు ఆ క్లబ్బుల యధీనము చేసి అచ్చట ఆ సభ్యులను సమావేశ పర్చుచుందురు. కర్మాగారములయందు పనిచేయు పాటకపు జనుల యుపయోగముకొరకు వారు పనిచేయుచోట్ల పెద్ద బల్లలమీద వారి కుపయోగించు గ్రంథనామములను అవి దొరకు గ్రంథాలయముల పేరును లిఖించి ప్రచురింపబడును. పల్లెటూరు ప్రజల యుపయోగముకొరకు మోటారుబండిలో గ్రంథముల పెట్టెలనుంచి దేశమంతటను పంపబడి ప్రజలకు పంచిపెట్టి వారలా గ్రంథములు చదివినపిదప తిరిగి వానిని స్వీకరించి తెచ్చుట కేర్పాట్లుచేయబడును. విద్యార్థులకును ఉపాధ్యాయులకును యుపకరించు గ్రంథముల నొకపెట్టెలో పెట్టి గ్రంథాలయములనుండి యుద్యోగులు పాఠశాలలకు తీసుకొనిపోయి నచ్చట ముఖ్యమగు ఉపాధ్యాయుల పరముచేయుదురు. అచ్చటి విద్యార్థులును ఉపాధ్యాయులును ఆగ్రంథముల నుండి పొందతగిన లాభమును పొందినపిదప తిరిగి వానిని తెచ్చెదరు. పాటకపు జనులు నివసించు కుటీరములకు గ్రంథాలయోద్యోగులు గ్రంథములను పెట్టెలలో పెట్టి తీసుకొనివెళ్ళి అచ్చట చదువగలవారలకు గ్రంథములను పంచిపెట్టెదరు. నిరక్షరకుక్షుల యుపయోగముకొరకు వారు గ్రంథములను అప్పుడప్పుడు చదువుచుకూడ యుందురు.

గ్రంథాలయముల కృషినిగూర్చి తెలిసినవారిలో అమెరికా ఖండవాసియు మిక్కిలి ధనసంపన్నుడునగు కార్నెజీ మహాశయునిగూర్చి తెలియనివారుండరు. ఈ శ్రీమంతుడు తన యపారమగు ధనమును తనతోడి మనుజుల జ్ఞానాభివృద్ధికొరకై యసంఖ్యాకములగు గ్రంథాలయములను స్థాపించి కీర్తివహించెను. ఈమహనీయుడు ఆంగ్లేయద్వీపములయందు ఈమహదుద్యమమును వ్యాప్తినొందించుటకు ఎక్కువ ద్రవ్యమును నిధిగా నేర్పర్చి దాని పరిపాలనకొరకు ధర్మకర్తల సంఘము నిర్మాణము చేసి వారిమూలమున గ్రంథాలయ ప్రతిష్ఠాపనాస్థాపనకు పూనకమున్న ఆదేశమందీయుద్యమము అంతవ్యాప్తికి రాలేదనియే చెప్పవలసియున్నది. ఇప్పుడా దేశములయందు ఈ ధర్మనిధిమూలమున జరుగుచున్న కృషియు తన్మూలమున ప్రజలు పొందుచున్న అమూల్యమగు జ్ఞానాభివృద్ధియు వర్ణనాతీతము. ముఖ్యపట్టణములయందలి గ్రంథాలయభవనముల నిర్మాణముకొరకు అమితమగు ద్రవ్యము వ్యయపెట్టబడుచున్నది. ఆప్రతిష్ఠాపనల నిర్వహించుటకుగూడ ఎక్కువ ద్రవ్యము ఆనిధినుండి ధర్మముచేయబడుచున్నది. కేంద్రగ్రంథాలయములను స్థాపించి తన్మూలమున పల్లెటూళ్లకు విరివిగా గ్రంథములను పంపుట

ఏర్పాట్లు చేయబడుచున్నవి. పల్లెటూళ్లలో జరుగు సంగీత సభలకును నాట్యరంగములకును ఈనిధినుండి సహాయము చేయబడుచున్నది. ఆంధ్రుల విద్యాభివృద్ధి కొరకు వీరు పాటుపడుచున్నారు. శిశుసంరక్షణకొరకు కూడ మిక్కిలి కృషి చేయుచున్నారు. ఈడుముదిరిన వారి విద్యాభివృద్ధికొరకు ఈనిధి పరిపాలకులు ప్రత్యేక ప్రయత్నములు చేయుచున్నారు. ఈ పనులన్నియు తాలూకాలయందును జిల్లాలయందును ప్రజాసేవ చేయుట కొరకై ఏర్పడియుండు ఐచ్ఛికసంఘములు చేయు సూచనల ననుసరించి జరుగుచుండును. విద్యార్థుల గ్రంథాలయములకును, పట్టణగ్రంథాలయములకును, పల్లెటూరు గ్రంథాలయములకునుకూడ ఈనిధినుండి విరివిగా సహాయము చేయబడుచుండును. సంగీత నాట్య శాస్త్రములను గూర్చిన గ్రంథములను వీరు ప్రచురించెదరు. ఈ అన్ని యుద్యమములకొరకును కార్నెజీ ధర్మనిధినుండి ధర్మముగా ఖర్చుచేయబడుచున్న సొమ్ము ఇంతయని చెప్పుటకు నలవికాదు. బెల్జియము అను చిన్ని దేశమున అర్థణా పోస్టుఖర్చుపంపినచో ఆదేశమందలి ఏ యుత్తమ గ్రంథాలయమునుండియైనను ఎట్టి యుద్గ్రంథమునైనను ఏ కుగ్రామమునకైనను తెప్పించుకొనవచ్చును. ఇంతవరకును మన దేశమునందును ఇతర దేశములయందును గ్రంథాలయముల పక్షమున జరుగుచున్న కృషిని గూర్చి వివరించబడినది. ఈ యుద్యమమును గూర్చి సామాన్యవిషయములను కొన్నిటిని గమనించి వెంటనే యవలంబించవలసిన కార్యవిధానము నిరూపించవలసియున్నది. ధర్మ గ్రంథాలయోద్యమ మన యేమి? దీని పరమప్రాప్యమేది? దీనివ్యాప్తి ఎంతవరకు? గ్రంథాలయమన పుస్తకములు భద్రపర్చు స్థానమనియు, గ్రంథభాండాగారియన పుస్తకముల కాపరియనియు పూర్వపు అభిప్రాయములు ఆధునిక కాలమున సంపూర్ణముగా మారినవి. పురాతన గ్రంథాలయములును దొంతనము వారిచే నిర్వహింపబడుచున్న పెద్ద గ్రంథాలయములును ఈ మర్యాదనే యిప్పటికిని యనుసరించుచున్నవి. పాశ్చాత్య గ్రంథాలయములును బరోడా సంస్థానపు గ్రంథాలయములును ఇట్టివికావు. గ్రంథాలయము నిజముగా ప్రజాసామాన్యపు విశ్వవిద్యాలయము. జాతిమత వృత్తి వయోవిద్యావిషయిక భేదము లేకుండ ప్రతివ్యక్తియందును నిగూఢమైయున్న అనంత శక్తులను ప్రవృద్ధిపరచు పరమసాధన మీ ప్రతిష్ఠాపనమై వెలయుచున్నది. కావున ఈ నిర్మాణము మూలమున అభివృద్ధి బొందవలసినవారు వేరువేరు అభిరుచులు కలవారును, వేరువేరు అంతరములు కలవారును నైయుండుటచే ఎవరికి తగిన సాధనము వారల కనువగు నట్లవలంబించి కార్యసాఫల్యము చెందవలసియున్నది. ఇతరదేశములందు ఈ యుద్యమము ఎట్లు కృషిచేయుచున్నదియు ఇదివరకు వివరింపబడినది. మన దేశమున కనువగు కార్యవిధానమేదియో ఇదివరకనేక మార్లు ఉపన్యాసముల మూలమునను వార్తాపత్రికల మూలమునను విశదీకరించబడినది. ఈయుద్యమ కార్యవిధానము మన దేశమందును, ఇతరదేశములందును ఎట్లు జరుగుచున్నదియుకూడ వివరింపబడినది. ఈ పుదుక్కోట గ్రంథాలయ వార్షికసభలో సమావేశమైన ప్రతినిధులు సంస్థానపరిస్థితులకనుకూలమగు కార్యవిధానమును ఈ సభలో నిర్ణయించ సమకట్టియున్నారు. కావున అందునుగూర్చి ముందుగా చర్చించుట యుచితముకాదు. "మనసుండవలెనుగాని, మార్గము దొరకక పోదు" అని ఆంగ్లసామెత యొకటి కలదు. కావున మనము ముఖ్యముగా కోరవలసినది కార్యదీక్ష. అట్టి కార్యదీక్ష సంపాదించినచో కార్యవిధానము దానంతటది వ్యక్తమగును. కావున మనయుద్యమప్రచారణచేయు దీక్షాపరులను గూర్చి వివరించుట ముఖ్యావశ్యకము.

ఈ విషయమునుగూర్చి చర్చించునపుడు ముఖ్యముగా మనము గమనించవలసిన విషయమేదియన, ప్రభుత్వము వారు ఈ యుద్యమమునగూర్చి ఎంత శ్రమతీసుకొని ఎంత ధనము వ్యయము చేసినను ఐచ్ఛికసంఘములే ఇందునుగూర్చి కృషి చేయవలసినవైయున్నవి. ప్రజాస్వామిక తత్వము ప్రతినరమందును రక్తనాళమందునుకూడ నిండి నిబిడీకృతమైయున్న పాశ్చాత్యదేశములయందుకూడ ఈ తత్వమాచరణలో యున్నది. ప్రభుత్వము ఇట్టి యుద్యమము చేపట్టి నడిపినయెడల అది నిర్జీవమగును. ప్రతివ్యక్తిని ప్రతిప్రతిష్ఠాపనకును విలక్షణమగు వ్యక్తిత్వమున కనురూపమగు భేదభావముండినగాని ఏవ్యక్తిగాని ఏప్రతిష్ఠాపనగాని సంపూర్ణ వికాసము చెందనేరవు. ప్రభుత్వమువారు నడుపు యుద్యమములలో ఈ భేదభావమునకు తావుండదు. వారమలులోకి తెచ్చు శాసనములు వుత్తరవులు అన్ని ప్రతిష్ఠాపనలను ఐక్యభావమునకు తెచ్చి అభివృద్ధి సాధనములను నశింపచేయును. సనాతనమగు భారతీయ ప్రతిష్ఠాపనల చరిత్రము మనము పరిశీలించినచో ఈతత్వము బోధపడగలదు. ప్రజల జీవిత మాకాలమున అన్యోన్యసంబంధమంతగా లేని రెండు భాగములుగా విభజింపబడియున్నది. ఒకటి ప్రభుత్వము వారి

యధీనముగ నుండెడిది. రెండవది కేవల సంఘసమిష్టి యొక్క యధీనమున యుండెడిది. ప్రజావికాసమునకు నవష్టంభకములగు యుద్యమములన్నియు ఈ రెండవ తరగతిలో చేరినవే. ఇందువలననే పూర్వకాలము నుండియు మన దేశమున జరుగు దానధర్మములన్నియు ప్రజాభివృద్ధి కొరకై సద్వినియోగములై ప్రజాసమిష్టికి జవసత్వము నొసగుచుండెను. మన యుద్యమముయొక్క పరమ ప్రాప్యము మానవమానస వికాసమని చెప్పవలసియున్నది. మనుజులెందరున్నారో వారి స్వభావములుకూడ అన్ని యున్నవని చెప్పవలెను. వీని నన్నిటిని అభివృద్ధి నొందించు సాధనములుకూడ అంత అసంఖ్యాకములని చెప్పిన యతిశయోక్తి కానేరదు. మానస వికాసమునకవసరమగు ప్రతిష్ఠాపనలను స్థాపించి నడుపవలసి వచ్చినపుడు ప్రభుత్వ ప్రతిష్ఠాపనలకు సహజలక్షణమగు, నియమబద్ధమైన సంపూర్ణైక్య స్వభావమునకు వాని యందు తావీయకూడదు. ఇందువలన ప్రభుత్వమునుండి గ్రంథాలయములు సొమ్మును గైకొనకూడదని చెప్పుటలేదు. ప్రభుత్వమువారు ఈ యుద్యమమునకు తగుసహాయము చేసి తామిచ్చు ద్రవ్యము సద్వినియోగమగునట్లు తగు కట్టుదిట్టములు చేయుట మిగుల యావశ్యకము. కావున ఈ యుద్యమము జయప్రదమగుటకు ముఖ్య సాధనము కార్యదీక్షాపరులు. వీరు ఈయుద్యమమున గట్టి నమ్మకముకలవారై సన్మార్గమున దీనినినడిపి తన్మూలమున దేశోద్ధరణ చేయుటకు బద్ధకంకణులైనవారుగా నుండవలెను. పుణ్యభూమియగు ఈ భరతవర్షమున అనాదినుండియు మానవజీవితమంతయు బ్రహ్మార్పణము చేయవలసిన నిబంధనయుండి యున్నది. కావున ఆత్మసమర్పణముయొక్క యావశ్యకతనుగూర్చియు అందలి ఫలమును గూర్చియు భారతీయులకు నొక్కి తిరిగి చెప్పుట యనావశ్యకము. మన దేశచరిత్రమును పరికించి చూడుడు. ఎంత ఆత్మసమర్పణ! ఎంత కార్యదీక్ష! ఎంత సేవాపరతంత్రము! ఎంత ఆత్మశక్తి! మన పూర్వుల జీవితములు మనకు బోధించుచున్నవి. మన భారతజనని అన్నివిధములను దైన్యస్థితినిచెంది గగ్గోలుగా ఆర్తనాదము చేయుచున్న ఈ యాతురసమయమున మన విధులను మనము గుర్తెరిగి మన మాతృఋణముతీర్చి ధన్యులముకాజనదా!

ఆత్మ సమర్పణము ప్రత్యక్షావతారము దాల్చెనో యన వెలసిన మహాత్మాగాంధి మన దేశమునందును, తేజఃపుంజముగా నుండుండి నడుపుచుండగను, మహాకవి రవీంద్రుడు దేశదేశాంతరములకును, ఖండఖండాంతరములకును జని అచ్చట శాశ్వతశాంతిని నెలకొల్పుటకు విశ్వప్రయత్నములు జరుపుచుండగను, అరవిందుడు పుదుచ్చేరినగరమున ఘోరతపమాచరించుచు విశ్వమానవజాతిని సంపూర్ణముగ సేవచేయుశక్తులను సముపార్జించుచుండగను, సేవాపరత్వమును ఆధునిక భారతీయులకు స్పష్టముగ బోధపడకుండుటకు తావున్నదా! భారతజాతి ఆధునికకాలమున చెందుచున్న పునర్నిర్మాణకార్యవిధానమందు మన ధర్మగ్రంథాలయోద్యమము ముఖ్యస్థానము నధిష్ఠించి యున్నది. సంఘమునందు శాంతిని నెలకొల్పి అన్యోన్య స్పర్ధలను నివారణచేయుటకు ఈ యుద్యమమునకుగల శక్తి అనంతము. మన దేశము నిప్పుడు చీకాకుపరచుచున్న సాంఘిక వైరములన్నియు ఈ యుద్యమము జయప్రదముగ నిర్వర్తించినచో మాసిపోగలవు. ఈ యుద్యమమువలన సమిష్టిజాతిని ప్రత్యేక వ్యక్తికిని కల్గెడు లాభములు కడు మెండు. ఈ యుద్యమము మనుజుని కేవలవైషయిక వాతావరణమునుండి లేవనెత్తి అనంతకళ్యాణగుణాకరుడును ప్రేమ సంపూర్ణుడును యగు పరమేశ్వరుని ప్రేమతత్వమును కించిత్కాలమైనను అనుభవమునకు తెచ్చును. మనుజుని జ్ఞానవంతునిగా చేయును. కావున భారతీయులారా! లెండు. నడుము బిగించుడు. మాతృసేవా పరతంత్రులుకండు! అప్పుడు ఈ ఆర్యావర్తమున ధర్మమోక్షములకు వ్యతిరిక్తము కాని అర్థకామములను మన భరతఖండమున పునఃప్రతిష్ఠించినవారమగుదుము! మహాత్మా గాంధిగారు సెలవిచ్చినట్లు మన హృదయపీఠమున పరమేశ్వరుని పునః సింహాసనాసీనుని చేసిన వారమగుదము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

# భారతవర్షమునందలి ప్రాచీన సరస్వతీభాండారములు

## ౧. భారతవర్షముయొక్క యైశ్వర్యము.

అనేక శతాబ్దములనుండియు భారతవర్షముయొక్క యైశ్వర్యముచే నితరదేశములవారనేకులాకర్షింపబడుచుండుట మన కందఱకును దెలిసిన విషయమేను. సోమనాథము, ఢిల్లీ మున్నగు పురములనుండి అమితమగు ధనమును తమ దేశములకుఁ గొనిపోయిన సుల్తాను మహమ్మదు, నాదిర్‌షాలను గూర్చియు, దక్షిణ హిందూ దేశదేవాలయములందు పాతిపెట్టబడియున్న మితిలేని ఐశ్వర్యమును గూర్చియు మనము వినుచున్నాము గాని భారతవర్షమునుండి సంస్కృతవ్రాత గ్రంథములను గొంపోయి అరబ్బీభాషయందు వ్రాసి మన శాస్త్రములను, గాథలను ఐరోపాయందున్న జాతులయందు ప్రబలుటకు సహాయభూతులైన "బాగ్దాదు" "ఖాలిఫ్"లను గూర్చి గాని అనేక అపూర్వ గ్రంథములయొక్క వ్రాతప్రతులచే నింపఁబడి మన పూర్వీకులచేఁ ప్రతిష్ఠింపఁబడిన భారతీ భాండాగారమును గూర్చి గాని సరస్వతీభాండాగారములను గూర్చిగాని మనము వినుచుండుటలేదు.

భారతవర్షముయొక్క వర్తకమును తమ స్వాధీనమునందుంచుకొనవలెనని పాశ్చాత్యదేశములు పెనగులాడుటకు కారణభూతంబులైన బంగారు, వెండి, వజ్రవైడూర్య, మరకత, మాణిక్యాదులతో గాని, పట్టు శెల్లాలు, ఉన్నిశాలువలతో గాని, ఇతర సంభారములతో గాని మన దేశముయొక్క యైశ్వర్యము సంపూర్ణముగాదు. ముఖ్యముగా సారస్వతమునందును కళలయందును, ఆధ్యాత్మికజ్ఞానమునందును, మన యైశ్వర్యము సంపూర్ణముగ విజృంభించియున్నది. ఈయాధ్యాత్మిక యైశ్వర్యముచేగూడ, దూరదేశస్థులనేకులాకర్షింపఁబడియుండిరి; అట్టివారి నామములు చరిత్రయందు మనకు లభింపకపోయినప్పటికిని, భారతవర్షమునందువారు సంపాదించిన అమూల్యవంతంబగు జ్ఞానైశ్వర్యముచే ప్రపంచమునందలి చింతనలన్నియు ఐశ్వర్యవంతములై యున్నవని జెప్పుట కెంతమాత్రమును సందియములేదు.

## ౨. భారతవర్షమునందలి ప్రాచీన భాండారములు.

అచ్చువేయుటకు సౌకర్యములులేని ప్రాచీనకాలమునందు గ్రంథభాండాగారముల నేర్పరచుటకు జనులెంత శ్రమపడియుండిరో యూహించుటకైన నలవిగాదు. వాటిని నేర్పఱచినవారికి విద్యాభివృద్ధియందుగల ఆసక్తియు, భక్తియు వర్ణనాతీతములు. అరిందాయగు నొక మసద్దీ చిన్న గ్రంథమైనచో కొన్ని నెలలను, పెద్దగ్రంథమైనచో కొన్ని సంవత్సరములను తదేకనిష్ఠతో కష్టపడి వ్రాసినఁగాని తయారుగాదు. అట్టి స్థితియందు కొన్ని వేల గ్రంథముల నొకచోటఁ గూర్చుటకెంతమంది మనుష్యులు యెన్ని సంవత్సరములు శ్రమపడవలసియుండునో యూహించుటకైన నలవి కాదు. ఇప్పుడన్ననో, దివ్యమైన భవనము నొకదానిని సంపాదించి, అందు కొన్ని వేల గ్రంథముల నొకసారియే కొనిపెట్టిన, అది గొప్ప గ్రంథాగారమగుచున్నది. ఇతర ప్రతిష్ఠాపనలవలెనే గ్రంథాగారమును నిర్మించుటగూడ ఆ కాలమునందు కార్యపరతంత్రులగు మహాపురుషుల వలన మాత్రమే నెరవేఱుచుండెడిది. లిఖితగ్రంథమునకు ప్రతిదాని చివరను, "యద్దృష్టం తల్లిఖితమ్" అను వాక్యమును వ్రాసి గ్రంథమును ముగింపునకు దెచ్చుచుండిరి. అనగా ఎట్లు చూచితినో అట్లే వ్రాసితినని యర్థము. ఇట్టి కష్టములకులోనై మన పూర్వీకులు భారతవర్షమునందంతటను ప్రతిష్ఠించిన గ్రంథాలయములను గుఱించి కొంచెము తెలిసికొందము.

# వివిధ విషయములు

గోదావరిజిల్లా ఆలమూరు గ్రామమందు కో ఆపరేటివు యూనియన్ తరఫున పఠనమందిరము 3-12-24 తేదీన తెరువబడినది. శ్రీ నరసింహదేవర సత్యనారాయణగారు పఠనమందిరావశ్యకతను గూర్చి ఉపన్యసించిరి. అందరును సభ్యులుగ చేరి చందాలు వేసిరి. ప్రాముఖ్యమగు వార్తాపత్రికలెల్ల తెప్పింపబడుచున్నవి. సహకారాదర్శములను, సహకారభావములను, విరివిగా వెదజల్లుటయును, గ్రామవాసులలో పరస్పరసహాయము సానుభూతి, సోదరభావము పెంపొందించుటయును దేశపరిస్థితులను తెలియజేయుటయును ఈ పఠనమందిరము యొక్క ముఖ్యోద్దేశ్యములు.

వెల్లూరునందు సరస్వతీ రీడింగు రూము అను పేరున పఠనమందిరము ఏర్పడినది.

క్రీస్తుశకము 1565 సంవత్సరము జనవరి 23 మంగళవారమునాడు తళ్ళికోటయుద్ధమున వీరశయన మొందిన రామరాజు పటమును హైదరాబాదు ఆంధ్రపరిశోధక సంఘమువారు సంపాదించిరి.

కడపజిల్లా కోడూరుపాడు గ్రామమునందున్న జ్ఞానోదయనిలయగ్రంథాలయమునకై దీపావళి పండుగ సందర్భమున ఆగ్రామమందు భిక్ష వసూలుచేయగా దాదాపు ఇరవైరూపాయలు వసూలైనవి.

సమస్త జాతీయోద్యమములకు పునాదియైన గ్రంథాలయోద్యమమును ఆంధ్రదేశమున బాగుగా ప్రచారము చేయుటకుగాను యాతగిరి లక్ష్మీవేంకటరమణగారు కాకినాడయందు ధర్మగ్రంథాలయ పత్రికను స్థాపించినారు. చందా సంవత్సరమునకు ఒకరూపాయి మాత్రమే. గ్రంథాలయోద్యమమునుగూర్చి చక్కని వ్యాసములు ప్రకటింపబడుచున్నవి.

నైజాం రాష్ట్రమందున్న తుమ్మలగూడెం గ్రామ శ్రీఆంధ్రవిజయ గ్రంథాలయమువారు నరకచతుర్దశినాడు దీపావళి భిక్షకు వెళ్లగా ౫౦ లు వసూలయ్యెను. మరునాడు ధనపూజ గ్రంథాలయమునందు జరుపబడినది.

బెజవాడయందున్న శ్రీభ్రమరాంబా మల్లేశ్వరాంధ్ర గ్రంథాలయము దినదినాభివృద్ధి గాంచుచున్నది. శివాలయ ప్రాకారమును అనుకొని దీనికొరకై ప్రత్యేకముగ చాలకాలము క్రిందనే కట్టింపబడిన మేడమీద, ఇటీవలనే ప్రవేశింప గలిగినది. వైశ్యశ్రేష్ఠుల యాదరణ వలన వెయ్యిరూపాయల విరాళములను వసూలుచేయ గలిగిరి. ప్రతిఅమావాస్యనాడును సభలు చేయబడుచున్నవి.

నైజాము రాష్ట్రమందు కొలనుపాక గ్రామమందున్న బహిరామియా గ్రంథాలయము భాషాభిమానుల యాదరణచే ఇపుడు క్రమముగ పనిచేయుచున్నది. ప్రతి గురువారము ఉపన్యాసములు జరుగుచున్నవి. అందు పాఠశాల బాలురు, ఉపాధ్యాయులు, ఇతర యౌవనులు పాల్గొనుచున్నారు.

## అక్షరహంసలు

ఈగ్రంథము మాకార్యస్థాన మలంకరించినది. ఇది ధర్మార్థకామమోక్షములలో తురీయమగు మోక్షాభిలాషులగు భక్తబృందమునకు కొంగుబంగారువంటిది. కీర్తనలయొక్క అక్షరనియమ మపూర్వమై శైలిమధురమై యున్నది. కంచెర్ల గోపన్నగారికి "రామదాసు" అను మరియొక్క వ్యావహారిక నామమున్నట్లే యీగ్రంథకర్తలగు గోపరాజు వెంకటసుబ్బారావుగారికి "మహాదేవ శంభో" యను రెండవ వ్యావహారిక నామ ముండుటయే వారు యపూర్వభక్తులని వేనోళ్లచాటుచున్నది. వీరికి శివకేశవుల భేద మావంతయు లేదు. వెల రు 0-8-0 లు మాత్రమే. వలయువారు గ్రంథకర్తగారిపేర కాకినాడకు వ్రాసికొనవలెను.

# గ్రంథాలయ ఉపయోగములు

**6-11-24** తేది గురువారం సాయంత్రము 4 గంటలకు రాజమహేంద్రవర రాజకీయోన్నత ప్రాథమికోపాధ్యాయ బోధనాభ్యసన పాఠశాలోపాధ్యాయ సంఘము తరపున "గ్రంథాలయములు, వానియొక్క యుపయోగము" అను విషయమును చర్చించుటకొక సభ జరిగినది. మహారాజశ్రీ అడవి శంకరరావుగారు అగ్రాసనాధిపత్యము వహించిరి. ప్రథమమున అడపా సూర్యప్రకాశరావుగారు ఉపన్యసించుచు గ్రంథాలయములు విద్యాలయములవలె జ్ఞానమును వెదజల్లునని బోధించిరి. తరువాత మద్దిరాల చిన్నయ్యగారు ప్రసంగించుచు గ్రంథాలయములలో ఊరిలోని నలుగురు కలుసుకొని వార్తాపత్రికల పఠించుచుండుటచే ప్రపంచజ్ఞానము పెంపొందునని సెలవిచ్చిరి. ఆమంచ సీతారామయ్యగారు తరువాత ప్రసంగించుచు తాము విద్యార్థిదశ వదలిన తరువాత తమ తీరుబడికాలమును సద్వినియోగము చేసుకొనుటకు గ్రంథాలయములకు పోవుచుంటిమనియు, పల్లెటూళ్లలో రైతాంగము వృథాగా పేకయాటతో కాలముపుచ్చుననియు అట్టివారికి గ్రంథాలయములు చాల యుపయోగకరముగ నుండుననియు నచ్చజెప్పిరి. తరువాత సయ్యద్ పీరు సాహెబుగారు ప్రసంగించుచు తాము నడిశేలేరు గ్రామములో గ్రంథాలయము నభివృద్ధిజేయుటకు పడిన పాటులను వివరించి గ్రంథాలయము వ్యాపారములలో

కూడ మనస్పర్థలు కలుగుట చాల విచారకరమనియు, తా మీవరకు గౌతమీ గ్రంథాలయమునకు పోవుచుండెడి వాడననియు, ఆంధ్రదేశములో నెల్ల ప్రసిద్ధికెక్కిన యీ గౌతమీ గ్రంథాలయములో కక్షలు బయలుదేరి గౌతమీ గ్రంథాలయము నెవ్వరి కందుబాటుగాని, నిరుపయోగమైన యూరిబయటి యొక గృహములోనుంచి అన్ని విద్యాలయములవారికి చాలదూరముగ నుంచుట తమబోటి యుపాధ్యాయుల దౌర్భాగ్యమనియు, దీని విషయమై రాజమహేంద్రవర పౌరు లెట్లు సహించి యూరకొనినదియు తమ కాశ్చర్యముగ నున్నదనియు సెలవిచ్చిరి. వీరి తరువాత చేబ్రోలు వెంకటదీక్షితులు గారు ప్రసంగించి గ్రంథాలయములో నెప్పటి పుస్తకము లప్పుడు లభించుననియు, ఇవియన్నియు విడివిడిగా నెవరికి వారు కొనుట సిద్ధించదనియు చెప్పిరి. తరువాత అధ్యక్షులు ప్రస్తుతమున హిందూదేశములో ప్రజాసామాన్యము రాజకీయవిషయములలో నెక్కువ అభిరుచి చూపుచున్నదనియు, వీరికి సరియయిన జ్ఞానమొసంగు గ్రంథములను సేకరించుటకు గ్రంథాలయము లవసరమనియు, ఆ పాఠశాలలోని యుపాధ్యాయులు సుమారు వంద గ్రామములనుండి వచ్చియుందురనియు వారు గౌతమీ గ్రంథాలయమును దర్శించి అది యెట్లు పనిచేయుచున్నది పరికించి వారి గ్రామములలో అపద్ధతిమీద గ్రంథాలయముల స్థాపింపవలెననియు హెచ్చరించిరి. అంతట సభముగిసెను.

# జర్మను గ్రంథాలయములందు సహకారము

జర్మనీ దేశమందు ప్రష్యాయను రాజ్యము గలదు. ఆరాజ్యమునందుగల విశ్వవిద్యాలయములు పదింటియందును రాజమందిరమందును గలసి పదునొకండు గొప్ప గ్రంథాలయములు కలవు. ఆగ్రంథాలయములన్నియు ఒకే విద్యామంత్రియొక్క పరిపాలన క్రింద ఉండియున్నవి. ఆగ్రంథాలయములన్నింటియొక్క ఉద్యోగులకును ఒకమాదిరిగానే జీతము లియ్యబడుచుండును. ఒకమాదిరిగానే తరిబీతును పొందియుండిరి. ఈ గ్రంథాలయ ఉద్యోగులందరును ఒక గ్రంథాలయమునుండి మరియొక గ్రంథాలయమునకు బదలాయింప బడుచుందురు. ఆ గ్రంథాలయము లందలి గ్రంథముల పట్టిక లన్నియును ఒకే నిబంధనల ననుసరించి తయారు చేయబడినవి. ఆ గ్రంథాలయములందలి నూతన గ్రంథముల పేర్లన్నియు ఒక ప్రచురమునందే ప్రచురింపబడుచుండును. అన్నిటియందుగల గ్రంథము లన్నింటికిని కలిపి గ్రంథముల పట్టిక నొకదానిని తయారుచేసిరి. విదేశ సారస్వత గ్రంథములను కొనుట యందీగ్రంథాలయములు ఒక్కొక్క గ్రంథాలయమొక్కొక్క విషయికమైన గ్రంథములను విక్రయమునకు దీసికొనుచుండును. అందువలన విదేశ సారస్వత గ్రంథములన్నియు మొత్తముమీద ఏదో యొక గ్రంథాలయమందు కాన్పించుచుండును.

విద్యార్థి తనకు కావలసిన గ్రంథము తన గ్రామ గ్రంథాలయమందుదొరకనియెడల, ఆగ్రంథాలయముద్వారా, తన గ్రామమునకు దగ్గరనున్న విశ్వవిద్యాలయమునకుగాని రాజభవన గ్రంథాలయమునకుగాని ఆ గ్రంథముకొరకు వ్రాయును. అక్కడను దొరకనియెడల, "ప్రచురణ సంఘము" వారికి వ్రాసి, ఆగ్రంథము ఏయితర గ్రంథాలయమునందున్నదో తెలిసికొని, ఆగ్రంథాలయమునకు తన గ్రంథాలయముద్వారా వ్రాయును. చదువరి తన గ్రామగ్రంథాలయమునకు జవాబుదారిగా నుండును. ఎరవు తీసికొను గ్రంథాలయము ఎరవిచ్చు గ్రంథాలయమునకు జవాబుదారిగా నుండును.

## ప్రచురణ సంఘము.

ఏగ్రంథమైన జర్మనీదేశమందున్న ఏ గ్రంథాలయమందున్నదో లేక విదేశములందున్న ఏ గ్రంథాలయమందున్నదో తెలుసుకొని, ఆవిషయమును కోరినవారికి తెలుపుటయే ఈ సంఘముయొక్క పని. ఏపుస్తకము విషయమైన తెలిసికొనగోరువారు ఆగ్రంథము తన కెందుకు కావలెనో వ్రాయుచు స్వల్పముగ రుసుమును ఇయ్యవలసియుండును. ఈ ప్రచురణసంఘముయొక్క ఉపయోగమును పొందుచున్నవి జర్మనీదేశమందే 382 గ్రంథాలయములు గలవు. ఇవిగాక ఐరోపాదేశమందున్న ఇతర గ్రంథాలయములుగూడ దీనియొక్క ఉపయోగమును బొందుచున్నవి.

ప్రష్యారాజ్యగ్రంథాలయ గ్రంథముల యొక్క పుస్తకములపట్టికకును ఈ ప్రచురణ సంఘమునకును విశేషమైన సంబంధముగలదు. ఈ రెండును రాజమందిర గ్రంథాలయముతోగూడ విశేషసంబంధమును కలిగియున్నవి. ఈసంఘ కార్యాలయమునందు 1,283,000 కాద్దుల

మీద వ్రాయబడిన గొప్ప గ్రంథముల పట్టిక కలదు. అందు పదకొండు ప్రష్యారాజ్య గ్రంథాలయములందు గల గ్రంథములనుగూర్చియు విపులముగా వ్రాయబడియుండును. ఇదిగాక, ఆదేశమందుగల ఇతర గ్రంథాలయములందుగల గ్రంథములపట్టికలుకూడ సిద్ధముగ నుండును. జర్మనీదేశమందలి ముఖ్యగ్రంథాలయములందు గల 16,000 పత్రికలయొక్క పట్టికనుగూడ ఈసంఘము వారు తయారుచేసినారు.

ఏపుస్తకమునుగూర్చియైన విచారణవచ్చినప్పుడు, ఆ గ్రంథమునుగూర్చి కార్డులమీద వ్రాసి అన్నిగ్రంథాలయములకును పంపెదరు. ఆగ్రంథమున్న గ్రంథాలయము వారు ఆకార్డుమీద ఆగ్రంథము తమయొద్ద గలదని వ్రాసి, తిరిగి ప్రచురణసంఘమునకు పంపెదరు. ఈరీతిగా విచారణకొరకు వచ్చిన గ్రంథవిషయము తేలఁపిమ్మట ఆఫలితము గ్రంథస్థము చేయబడును. 1912 సంవత్సరమునం దీసంఘమువారికి 13,965 గ్రంథములనుగూర్చి విచారించుచు 1,35,207 ఉత్తరములు వచ్చినవి. అందు 9,737 గ్రంథములనుగూర్చిన విచారణ ఫలప్రదమైనది.

## గ్రంథముల ఎరువు

ఈప్రచురణసంఘమునకు చెందిన 400 గ్రంథాలయములు కలవు. ఈసంఖ్య దినదినమును అభివృద్ధిజెందుచున్నది. ఈసంఖ్యలో ముప్పాతికభాగము పాఠశాలలకు చెందిన గ్రంథాలయములై యున్నవి. వ్రాతగ్రంథప్రతులు, అమూల్యములైన ముద్రితగ్రంథములు ఎరువు ఇయ్యబడవు. మొత్తముమీద గ్రంథములన్నియు మూడువారములవరకు ఎరువియ్యబడును. పత్రికలు, కరపత్రములు మొదలైనవి ఒకవారమునకు మాత్రమే ఎరువియ్యబడును. ఎరువును తీసికొను గ్రంథాలయము, ఎరువిచ్చు గ్రంథాలయమునకు జవాబుదారీయైయుండును. ఎరువుతీసికొను గ్రంథాలయము, తనచదువరులకు కావలసిన నిబంధనలను ప్రత్యేకమేర్పరచుకొనును. ప్రష్యారాజ్యమందుగల 11 పెద్ద గ్రంథాలయములందును సభ్యులు తాము మామూలుగా ఇచ్చుచందా గాక, తీసికొను ప్రతిపుస్తకమునకు వేరుచందా ఇయ్యవలసియుండును. ఆ తీసికొనుపుస్తకమే, ఇతర గ్రంథాలయమునుండి తెప్పించి ఇయ్యవలసియుండిన, రుసుముకొంచెము ఎక్కువయుండును. ఆరుసుములో కొంత భాగము గ్రంథమును ఎరువిచ్చు గ్రంథాలయమునకు జెందును. ఇంకను అవసరమయ్యె ఇతర యేర్పాటులుగూడ గ్రంథాలయములు పరస్పరము జేసికొనుచుండును.

# రాజకీయ ప్రాచ్యలిఖితగ్రంథాలయ దుఃస్థితి

మెకంజీ, బ్రౌన్, మొదలగు మహాశయులు ద్రవ్యమును లక్ష్యపెట్టక దేశమందంతటను వెదజల్లి సేకరించియుండు కైఫీయత్తులు, సన్నదులు, దానశాసనములు, లోకల్ రికార్డులు మున్నగాగల చరిత్రాంశములను తెలుపునట్టి గ్రంథములును జగద్విఖ్యాతులగు ప్రాచీనగ్రంథకర్తలచే రచియింపఁబడిన వివిధశాస్త్రీయ గ్రంథములును మదరాసునందున్న ఈ గ్రంథాలయమందు వేనవేలున్నవి.

అట్టి మహోన్నతిఁజెందిన గ్రంథరాజము లతిశిథిలములై పునర్లేఖనము చేయుటకు సంసిద్ధములై నానాటికి క్షీణించుచున్నవి.

గ్రంథాలయమందుండు పుస్తకములన్నియు లక్షగ్రంథములకంటె హెచ్చుగా నున్నవి. అయ్యవి సంస్కృతాంధ్ర ద్రావిడ కర్ణాటకాది వాఙ్మయములకు సంబంధించినవిగా నున్నవి. వానిపరిస్థితుల గమనించుటకై నియమించియుండు వారిసంఖ్యయు అతిస్వల్పము. ఒక్క సంస్కృతభాషకు ముగ్గురు పండితులను, తెనుఁగుభాష కొకరిని, ద్రావిడభాష కొకరినిగా నియమించి తక్కిన భాషలయందుండు గ్రంథములు వెనచూచెడివారును లేక పాడుపడి పోవునట్లు చేసియున్నారు.

ఈ గ్రంథాలయస్థితిగతులను చూచుచుండుటకొక లైబ్రేరియన్, అసిస్టెంటు లైబ్రేరియన్, 4గురు పండితులు, ఒక కాపీస్టు, గ్రంథాలయమునకువచ్చి చదువువారలకు పుస్తకముల నిచ్చుటకొక అటెండరును నియమింపఁబడియున్నారు. వీరికందరికిని పైయధికారి క్యూరేటరు. ఈక్యూరేటరు ప్రెసిడెన్సీకాలేజిలో సంస్కృతప్రొఫెసర్ పదవియందుండెడివారు. వీరికి కాలేజివిషయముల గమనించుటకే ప్రొద్దుచాలుటలేదు. ఇంక గ్రంథాలయపరి

స్థితులను గమనించి లోపాలోపములను సవరించుటకును గ్రంథాలయ పురోవృద్ధికై తగిన సలహాలను విద్యాశాఖ ముఖ్యాధికారులకు తెలుపుటకు తగిన యవకాశము లేనే లేదు. గ్రంథాలయమందుండునట్టి యధికారులు ఏమి వ్రాసి పంపినను ఆ రికార్డులపై సంతకము చేసి విద్యాశాఖవారికి బంపునట్టిస్థితియే తప్ప క్యూరేటరుపదవి నలంకరించినలగాయతు నేటివరకును వీరేలాటి యభివృద్ధియు జేసినటుల కానరాదయ్యె. వీరికి పూర్వ మీస్థానము నలంకరించియుండి కీర్తిశేషులైన శ్రీయుత రంగాచార్యులుగారు చేసిన మహోపకారముచే నానాస్థలములనుండి గ్రంథముల నార్జించునట్లును అట్టి గ్రంథములను ముద్రించి లోకహితము చేయవలయుననియు చాల ప్రయత్నముల చేసి గవర్నమెంటువారిచే నొక గ్రంథార్జనశాఖను వారి కాలములోనే నెలకొల్పిరి. అటుల నెలకొల్పినశాఖచే 1915 సం॥ నుండి 1922 వరకును అమూల్యములును అపూర్వములును నగు గ్రంథరత్నములార్జింపబడినవి. పాపమామహనీయు డీ గ్రంథములను చూడకయే లోకాంతరగతుండయ్యెను. ప్రకృతమందాశాఖనుకూడ దొరతనమువారు తీసివేసిరి. అట్టిమహనీయునికృషిచేతనే నేటికాలమున కీ గ్రంథాలయ ముండునట్టి స్థలమైన తెలియునట్లాయెను. ప్రకృతమందుండు క్యూరేటరుగారే కొన్నిరోజులు గ్రంథాలయస్థితులను చూచుచువచ్చినచో నామమాత్రావశిష్టమగుటకు సందియము లేదు.

ఇక పండితులు చేయునట్టి కేటలాగులను సరిచూచి సవరించి ముద్రణమునకు బంపుట మున్నగు కార్యములం జూచుటకు లైబ్రేరియన్, అసిస్టెంటు లైబ్రేరియన్ వీరిరువురకు సరిపోవుచున్నది.

పండితులు ఒక సంస్కృతభాషకు మాత్రమే యిద్దరున్నారు. వారికి సహాయ మొనర్చుటకు పండిట్ కాపీస్టు ఒక్కరున్నారు.

తెనుగున కొకరిని ద్రావిడభాష కొకరిని పండితులుగా నియమించి వారికి సహాయము చేయుటకు కాపీస్టులు లేకనే వారే గ్రంథములను చదువుచు చదివినవాటికి క్యాటలాగులు తయారు చేయుచు తంటాలు పడుచున్నారు. ఉండునట్టి గ్రంథములన్నియు లోకల్ రికార్డులు మొదలుగాగల గ్రంథములు, ఆంధ్ర, కర్ణాటక ద్రావిడభాషలలోనే శిథిలీకృతములైయున్నవి. ఈ గ్రంథములను చూచుటకును క్యాటలాగుల తయారుచేయుటకును మనుష్య సహాయ మాయాంధ్ర ద్రావిడ పండితులకు చాలదు. ఇక కర్ణాటక భాషలో లెక్కలేని గ్రంథములును, చరిత్రములకు సంబంధించిన లోకల్ రికార్డులును వేనవేలున్నవి. ఆభాష కొక పండితుడుకూడ లేడు. పండితుల జీతములు గూడ స్వల్పముగా నున్నవి. పని మాత్రము మెండు.

గ్రంథాలయమందు ఈ క్రిందిలోపములను వెంటనే సవరించినగాని ఉపయోగ ముండదు.

1 వచ్చునట్టి విజిటరులకు తగిన స్థలము లేకుండుట.

2 ఎట్టులో తంటాలు పడియైనను చదువుకొందమన్నను ఒక పుస్తకమును తెప్పించుకొని చదువుటకు లెక్కలేని కేటలాగులను చూచి తెలుసుకొనవలసినదిగా నున్నది. చూచినప్పటికిని వాటి నెంబరుల వ్రాసియిచ్చి గ్రంథమును తెప్పించుకొనుటకు జాలసేపగుచున్నది. అట్లగుటకు కారణము సరియైన లిస్టులేని లోపమె యనదగును.

3 ఆర్జించి తెచ్చియుంచు గ్రంథములను చూచుటకైన నివ్వరు. అట్టి పుస్తకములను కాపీచేసి లైబ్రరిలో నుంచినతర్వాత విజిటరులకియ్యబడునని చెప్పుచున్నారు. పోనిండు, అటులనే కాపిచేసిన తరువాత జూతమంటే ఆర్జించి 2, 3 సంవత్సరములయ్యె, నేటివరకును కాపిచేయకనే యుంచియుండుట కడుశోచనీయము.

4 గ్రంథాలయమందుండునట్టి ప్రాచీన గ్రంథములను అనేక రికార్డులను రీకాపిచేసి యుంచకనే నానాటి కొక పత్రముచొప్పున నూడిపోవునట్టి స్థితిలో నుంచియుండుట మిక్కిలి సంతాపకరము.

5 దేశాటన మొనర్చి గ్రంథముల సంపాదింప మొదలిడినచో గ్రంథములు అసంఖ్యాకములు చిక్కునని తెలిసియుండగా నింతలో ఈ శాఖను తీసిన విషయ మత్యంత దుఃఖకరము.

ఈ గ్రంథాలయ విషయములను విచారించి కనుగొనుటకుగాను గవర్నమెంటువారు ఇటీవలనే కమిటి నొకదానిని ఏర్పరచి యున్నారు. ఈకమిటీవారు ఏమిచేయుదురో ముందు ముందు చూడవలసియున్నది.

# చతుర్థగంజాంమండల గ్రంథాలయ మహాసభ, కళింగపట్నం

## తీర్మానములు.

(1) గ్రంథాలయోద్యమాభివృద్ధికిని ఆంధ్రవాఙ్మయాభివృద్ధికిని తమజీవితమును ధారపోసి అకాలమృత్యువు వాతబడిన శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు, కావ్య చెలికాని లచ్చారావు, వంగూరి సుబ్బారావుగార్ల యొక్క ఆత్మలకు శాంతిగలుగుగాక యని ఈసభవారు భగవంతుని ప్రార్థించుచున్నారు.

(2) డిస్ట్రిక్టు బోర్డులు, తాలూకాబోర్డులు, మునిసిపాలిటీలు, తగినస్థితిగలిగిన సంస్థలు, ధర్మ గ్రంథాలయములకు, పఠన మందిరములకు విరివిగ గ్రాంటుల నొసంగవలెనని ఈసభవారు ప్రార్థించుచున్నారు.

(3) గ్రామపునరోభివృద్ధికి హేతుభూతంబులగు ధర్మగ్రంథాలయములకు గ్రాంటులనిచ్చి గ్రామాభివృద్ధికి తోడ్పడవలెనని యీ జిల్లాయందలి యూనియన్ బోర్డులను ఈసభవారు ప్రార్థించుచున్నారు.

(4) (క) గ్రంథాలయసభలు ఈక్రిందివిషయములు గమనించి పనిచేయుట మూలకముగా గ్రంథాలయముల సజీవముగ నుంచవలెనని తీర్మానించుచున్నారు.

1. శిలవస్తువులు అనగా రాగి, ఇత్తడి, రాయి, మట్టి, మొదలగువానితో చేయబడిన విగ్రహములు, ఉపకరణములు, అలంకారములు మొదలగునవియును పురాతన చిత్తరువులు మొదలగువానిని సంగ్రహించి, గ్రంథాలయమునందు ప్రదర్శించుట.

2. తమ గ్రామచరిత్రను వ్రాసియుంచుట, దీనియందు పురాతనచరిత్రయేగాక ప్రస్తుతపు సాంఘిక, ఆర్థిక, నైతిక పరిస్థితులన్నియు అత్యంతవిరళముగ నుండవలెను.

3. అన్నిమతములకు సంబంధించిన జాతీయఉత్సవములనగా దేవీనవరాత్రములు, శ్రీకృష్ణజయంతి మున్నగు పండుగులు పర్వములగు భారతజాతీయ నిర్మాణమునకు తోడ్పడు మహాపురుషుల వర్ధంత్యుత్సవములను జరుపుట.

(చ) ఈకార్యములన్నియు నిర్వహించుటకును అనగా నూతనగ్రంథాలయములు స్థాపించుటకును, పోషించుటకును పురాతనగ్రంథములు ముద్రించుటకును శిల్పవస్తువులు సంగ్రహించుటకును, జాతీయఉత్సవములు సల్పుటకును ఇంకను గ్రంథాలయోద్యమమును విరివిగా వ్యాపింపజేయుటకును గ్రంథాలయసభ్యు లెల్లరు సంక్రాంతి పండుగ దినములందు జాతీయభిక్షను ద్రవ్యరూపమునను, వస్తురూపమునను వసూలు చేయవలసినది.

(5) గంజాంమండలమందు అన్నిపట్టణములందును పల్లెలయందును ధర్మగ్రంథాలయములను పఠనమందిరములను స్థాపింపవలెననియు మండలగ్రంథాలయసంఘమందు చేరి కృషిసలుపవలెననియు ప్రజల నీసభవారు హెచ్చరించుచున్నారు.

(6) బరంపురం ఆంధ్రభాషాభివర్ధనీ సంఘమువారిని గంజాంమండల కేంద్రగ్రంథాలయసంఘముగా ఏర్పడుటకు ఈసభవారు కోరుచున్నారు.

(7) క. ఆంధ్రమండలమందున్న మండల గ్రంథాలయములన్నిటికిని తమ గ్రంథములన్నిటిని ఉచితముగా నిచ్చుచు గ్రంథాలయోద్యమాభివృద్ధికి చేయూత నొసగుచున్న శ్రీ వావిళ్ళ రామస్వామి శాస్త్రుల్లు అండు సన్సువారికీ సభవారు వందనముల నర్పించుచున్నారు.

చ. ఈమండల గ్రంథాలయముగా నేర్పడిన శ్రీ బరంపురం ఆంధ్రభాషాభివర్ధనీ సంఘమువారికి వారి గ్రంథముల నిచ్చుటకుగాను శ్రీ వావిళ్ళ రామస్వామి శాస్త్రి అండు సన్సు వారిని ఈ సభవారు ప్రార్థించుచున్నారు.

(8) వ్యవహారమునను, సంభాషణము, ఉత్తర ప్రత్యుత్తరముల నాంధ్రులందరు ఆంధ్రభాషకు ప్రాముఖ్యత నొసంగవలెనని ఈసభవారు తీర్మానించుచున్నారు.

(9) గంజాంజిల్లా గ్రంథాలయసంఘమును ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమునకు శాఖాసంఘముగ జేర్చుటకు తీర్మానించడమయినది.

(10) గ్రంథాలయములందు పుస్తకభాండాగారమునకు తోడు రాట్నమునకు కూడ తావొసగి పురాణ పత్రికాపఠన సమయమందు, తదితర సమయములందు ధర్మముగ నుండుటకు రాట్నము త్రిప్పుచు నూలు వడుకుటకు సదుపాయము జేయ నీసభవారు హెచ్చరించుచున్నారు.

(11) గంజాంజిల్లా బోర్డుద్వారా గ్రంథాలయముల కిచ్చునట్టు వ్రాయుటను ఈమండల గ్రంథాలయ సంఘము యొక్క సలహానను సరించి పెట్టవలెనని ఈసభవారు సదరు బోర్డువారిని ప్రార్థించుచున్నారు.

(12) మండల గ్రంథాలయ సంఘమును యిదివరలో చేసిన నిబంధనల ననుసరించి సభలను జరుపుచు కార్య క్రమమును విరివిగా సాగించుటకుగాను తిరిగి పునరుద్ధరించుటకు తీర్మానించడ మయినది. మండల గ్రంథాలయ సంఘమునకు ఈక్రిందివారిని నిర్వాహకులుగా ఎన్నుకొనడమైనది.

(1) మ|| రా|| వరహగిరి జోగయ్య పంతులుగారు, అధ్యక్షులు.

(2) ఉపాధ్యక్షుడు, చెన్నూరి నాగేశ్వరరావుగారు, కేంద్రగ్రంథాలయమునకు ప్రధానకార్యదర్శి, ఆంధ్రభాషాభివర్ధనీ సంఘ కార్యదర్శి.

మండల గ్రంథాలయ సంఘకార్యవిధానము జరుపుటకు తి త్తిబలరామయ్యగారిని కార్యదర్శులుగను,

సంచారకార్యదర్శులు:—1 రొక్కం బాలకృష్ణారావుగారు, 2 సివల సుబ్బారావుగారు, 3 పాణంగిపల్లి వరహాలుగారు.

కార్యనిర్వాహక సభ్యులు:— 1 ఉన్నవ వెంకట వరహ బుచ్చిరామలింగంగారు, బరంపురం. 2 శ్రీజగన్నాథపాడిఖడంగగారు, బారువ. 3 న్యాపతి నారాయణమూర్తిగారు, 4 కోకా కోదండరామయ్యగారు, 5 పాకల సత్యనారాయణగారు 6 తూముల కృష్ణమూర్తిగారు, 7 రావి లక్ష్మణరావుగారు, 8 పోతాప్రగడ సింహాచలం పంతులుగారు, 9 పాటూర్నరి స్వామిబాబుగారు, 10 టంకాల సాంబమూర్తిగారు, 11 మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు, 12 గిడుగు సీతాపతిరావుగారు.

ప్రతి గ్రంథాలయ ప్రతినిధి

(13) గాబోవు జిల్లాసంఘసభను ఇచ్ఛాపురం తాలూకా కమిటీలో చింతామణి గ్రంథాలయపక్షమున సాధ్యమైనంత త్వరలో సమకూర్చుటకు తీర్మానించడమయినది.

# నైజాము రాష్ట్ర గ్రంథాలయసభ

నైజాము రాష్ట్రమందున్న గ్రంథాలయము లన్నింటి యొక్క ప్రతినిధులను చేర్చి సభ నొకదానిని సమావేశము చేయవలెనని కడచిన నాలుగుసంవత్సరముల నుండియు ప్రయత్నములు జరుగుచున్నవి. కాని ఆ ప్రయత్నములు కొనసాగలేదు. ఇప్పు డట్టిసభ సమావేశమగు సూచనలు గన్పట్టుచున్నవి.

ఆసభలో ప్రవేశపెట్టిన బాగుండునని గంగరాజు రఘునాథరావుగారు తెనుగుపత్రికయందు ఈక్రింది తీర్మానములను సూచించియున్నారు.

1 ఆంధ్రజన సంఘముతో సంబంధము.

2 శ్రీకృష్ణదేవరాయల ఆంధ్రభాషానిలయము(హైదరాబాదు)ను (నైజాము రాష్ట్రమునకు) కేంద్రగ్రంథాలయముగా మార్చుట.

3 ఆంధ్రజన సంఘములో గ్రంథాలయోపసంఘమును నియమించుట.

4 సంచారకార్యదర్శిని నియమించుట.

5 పైకార్యదర్శి భృతినిమిత్తము ప్రతిగ్రంథాలయము తమరాబడినుండి సంవత్సరమునకు నూటికి పదిరూపాయలవంతున చెల్లించుట.

6 శాసనములు, తాళపత్ర గ్రంథములు సమకూర్చుట

7 రాత్రిపాఠశాలలు స్థాపించి బీదబాలురకు కార్మికులకు వ్యవసాయదారులకు విద్య నేర్పుట

8 గోరక్షణ, హిందూమహాసభశాఖల నిర్మించుట.

# గ్రంథాలయ ప్రయోజనము

(హైదరాబాదునందున్న శ్రీ కృష్ణదేవరాయల ఆంధ్రభాషానిలయమందిర ప్రవేశమహోత్సవమునాటి అధ్యక్షులైన కట్టమంచి రామలింగారెడ్డి యొక్క వచనమునుండి)

ఆంధ్రులది పరాశ్రయమును ఆశించు బ్రతుకు కాదు; స్వసహాయముచేత నుద్ధరింపదగు ప్రారంభములు మనయందెక్కువ. ఇందులకు మనవారు సంఘసంస్కార విషయమందును గ్రంథాలయవ్యాపనమందును గడించియుండెడు సిద్ధులే సాక్షి. ఈ గ్రంథాలయోద్యమము జనబాహుళ్యముచేత అంగీకరింపబడకముందే శ్రీ మునగాల జమీందారుగారు ఈ నిలయమును నిర్మించినవారగుట ఈ యుద్యమమునకు వారు మార్గదర్శకులనుట అతిశయోక్తి కానేరదు. ప్రకృతము గ్రంథాలయములు విశేషముగ స్థాపింపబడుచున్నవి; అమితముగ నేనాటికి స్థాపింపబడనేరవు. అవి యెన్నియున్నను చాలవు. అంధకారమును విరియింపజేయు నీ నక్షత్రమండలిలో మీ నగరమం దుద్భవించినయది ప్రాథమికము. భాగ్యనగరము మీ యూరిపేరు దీనిచే సార్థకమైనది.

మీ యొక్క ఆంధ్రజాతీయ భావోన్నతికి సూచకముగ నీపుస్తకాశయమును శ్రీ కృష్ణదేవరాయ నామాంకితము జేసియున్నారు. దీనికన్న గొప్పపేరు దేశచరిత్రమందు కన్పట్టదు. దేశభక్తికి, కార్యోత్సాహమునకు, భాషాకృషికి, ఈ "హిందూరాజ్యరమాధురంధరుని" స్మరణ అమోఘమైన మంత్రము. దాని ధ్యానముచే ఆంధ్రులు ధన్యులౌట నిజము.

జ్ఞానమును వ్యాపింపజేయు పద్ధతులలో ముఖ్యములైనవి నాలుగు:—పాఠశాలలు, పుస్తకశాలలు, వార్తాపత్రికలు, ప్రసంగములు. ప్రజాప్రతినిధులచే పరిపాలింపబడు దేశములలో ఈ నాల్గును బహు చక్కగ నిర్వర్తింపబడుచున్నవి. కారణము స్పష్టము. రాజ్యతంత్రము ప్రజాధీనము గావున ప్రజలయొక్క మేలును వృద్ధిజేయుటయు దానికి సహజమైన కర్మము. రెండవది: ప్రజలయొక్క వివేకము ననుసరించి రాజ్యతంత్రము నడచును. జనబాహుళ్యమునందు జ్ఞానాభివృద్ధిని గలిగింపకపోయిన రాజ్యము చెడును. మూఢరాజ్యము మంచిరాజ్యము కానేరదు. అట్లగుట నెల్లరును విద్యను విస్తరింపజేయు మార్గముల ననుసరింతురు. అమెరికాదేశము ప్రజాపాలిత రాష్ట్రములలో ప్రాథమికము. అక్కడ పుస్తకాగారములు వ్యాప్తికిని వృద్ధికిని వచ్చిన రీతి నింకే దేశమందును లేదు. పురములు, తాలూకాలు, జిల్లాలు, రాష్ట్రములు మొదలగు ప్రకృతులు తమతమ పరిపాలనా పరిమితిని ఆదాయమును అనుసరించి లైబ్రేరీల స్థాపించుచున్నవి. పసిపిల్లల కాశ్రయమైనవానిని పెద్దవారికి నుచితమైనవానిని ప్రత్యేకించి యుంతురు. ఇట్లు చేయుట యవశ్యకర్తవ్యము. రాజ్యాంగములచేత నిర్మింపబడు వానికన్న ధార్మికులైన ధనాఢ్యులచేత ప్రతిష్ఠింపబడినవి సర్వవిధముల నెక్కుడని చెప్పవచ్చును. పాశ్చాత్యులు ధనసంపాదనమందే కాక వినియోగమునందును సమర్థులు. మన జనసామాన్యమట్లు కుటుంబములకు మించిన దృష్టియు శ్రద్ధయు లేనివారు కారు. వ్యష్టికన్న సమష్టి ముఖ్యమనియు, సంఘము చెడిన కుటుంబములును గౌరవహీనదశకు వచ్చుననియు చక్కగ హృదయపూర్ణముగ భావించి, వారు సంఘశక్తికి నుద్దీపకములైన త్యాగముల నన్నింటిని ధారాళముగ జేతురు. లైబ్రేరీలకొఱకు ఒక్క అమెరికాయందే కాక ఇంగ్లాండునందును విశేషముగ కార్నెగీయను మహాత్ముడు ద్రవ్యసహాయము చేసియుండుట జగద్విదితము. రాక్ ఫెల్లర్ మొదలగువారు చేసిన త్యాగములు అనేకకోట్లను మీఱియున్నవి. నిజమైన క్షాత్త్ర తేజస్సు ప్రబలియుండుచోట్లలో దేశమునకై ప్రాణమును ధనమును వినియోగింప నెవ్వరు వెనుదీయరు.

జ్ఞానము ఉత్పత్తికి రానిది జనులలో ప్రసరింపనేరదు. జ్ఞానము విరివియైనమాత్రన చాలదు. అది పొడుగుగను లోతుగను దినదినము పోవుచుండవలయును. అప్పుడు గదా నిక్కమైన జ్ఞానాభివృద్ధి! ఎప్పుడో ఎవ్వరో కనిపట్టి చేకూర్చిన విద్యలను విమర్శింపక, అప్పుడప్పుడు పరిశీలింపక, వానియందలి మలినిని దీయక, అవి శుద్ధతరము లగునట్లు నూతనాంశములను చేర్పక, నిలుకడ దాల్చిన కుళ్లునీళ్లుగా నుంచుకొని, జనులకు పోయుచు వచ్చిన అనారోగ్యము ప్రబలి క్షయవ్యాధిని కలిగింపక మానదు. కావున వ్యాప్తికి సృష్టియు ప్రధానమని భావించి ప్రకృతాదిశాస్త్రకృషికిని తన్మూలమున నూతన

ఫలితము బడసి సంఘమును విజ్ఞానసమర్థ్యము చేయుటకును వలయు సౌకర్యముల గలిగింపవలయును. పుస్తకాగారములు కాలువలవంటివి. చెఱువులేనిది కాలువలు వృథలు. చెఱువులుండియు వానలుకురియకున్న క్షామము నివారణకాదు, మనుష్యప్రయత్నము చేత స్థాపింపబడియుండు నూతనపరిశోధకశాలలు చెఱువులవంటివి; మహనీయులయొక్క ప్రతిభావిశేషమే వర్షము. ఏరాజ్యమున మూఢభక్తి ప్రబలి, మతముల పేర, మనుష్యుల యోజనాశక్తికిని, నీతికిని, వర్తనమునకును తగుమైన స్వాతంత్ర్యము నియ్యకుందురో ఆరాజ్యము కుళ్ళి కంపెత్తిపోవును. అట్లు దుర్గంధముగా నుండినయెడల ఏపరదేశీయు లను మునిసిపాలిటీవారో వచ్చి దానినూడ్చి పాఱగ్రుక్కుదురు.

పాశ్చాత్యదేశములలో నూతన పరిశోధనలు, తత్త్వములు, సిద్ధాంతములు, సృష్టులు వెలువడనిదిన మొక్కటియు లేదు. మనుష్యప్రకృతి యను మహావృక్షమక్కడ క్షణక్షణమును క్రొత్తచిగుళ్లను నూతనవికాసములను బయలుపుచ్చుచుండును. క్రొత్తక్రొత్త గ్రంథములు ప్రతిదినమును ప్రచురమునకు వచ్చుచుండును. మనయందు ఆధునికవిద్యలు మిక్కిలియు బీటుపడి శోషించి యున్నవి. ఏ గ్రంథాలయమును లెక్కించి చూచినను సరే, ప్రాచీనమునకు చేరిన గ్రంథములు వెయ్యియున్న, ఆధునికములు ఏబదియైన నుండుట యరిది. శ్రుతిస్మృతులు, వానిమీద వ్యాఖ్యానములు, ఆవ్యాఖ్యానముల మీద వ్యాఖ్యానములు, వ్యాకరణములు, కావ్యములు, ప్రబంధములు, సాహిత్యదర్పణములు, సంగీతకళానిధులు, శతకములు, ఇట్టివేగాని సంఘ, మానస, ఆర్థిక, రాజ్యతంత్ర, ప్రకృత్యాది శాస్త్రములను చేరిన గ్రంథములు అపురూపములు. సనాతనముల నీరీతి నింతఘనముగ మెడగట్టుకొని యేదేశమును వర్తమానమను అల్లకల్లోలమైన సముద్రమును ఈది భద్రభవిష్యత్తను దీవిని చేరజాలదు.

లైబ్రరీల కట్టు సాహాయ్యము చేసిన కార్నెగీ రాక్‌ఫెల్లరు మొదలగువారును, ప్రకృత్యాది శాస్త్రములను ఇంజనీరింగు మొదలగు కళలను పరిశోధించి నూతనాంశముల కనిపట్టుటకు సాధకములైన గొప్పశాలలను స్థాపించి అచ్చట పనిచేయువారలకు గొప్పవేతనములను కలిగించి యున్నారు. సృష్టికి వ్యాప్తికిని యుండు సంబంధమును గ్రహించినవారగుట కాబోలు ఈ నిలయమునకు స్థాపకులైన శ్రీ మునగాల జమీందార్లును, విజ్ఞానచంద్రికామండలి ఇత్యాది గ్రంథకర్తృ సమాజములకును స్థాపకులును పోషకులునై యున్నారు. మన దేశమునందు ఆధునిక శాస్త్రములను కళలను వివరించు గ్రంథములు విశేషించి ప్రచురింపబడక యుండినయెడల, ప్రాతవాసన పట్టిన గ్రంథాలయములచే మేలా కీడా యెక్కువ గలుగుననుట చర్చనీయమగును. మంచినీళ్ళు లేనిచో కొళాయీలును లేకుండెననే మేలు!

గ్రంథాలయములు గ్రంథకర్తృత్వమునకు ప్రబలసాహాయ్యకములు. ప్రతి యొక్క ఆలయమును ఒక్కొక్క ప్రతిని గొనినయెడల పుస్తకకర్తలయొక్క దౌర్భాగ్యము తొలగిపోవును. అట్లు చేయక ప్రతియాలయమును కర్తలను ఉచితముగా గ్రంథముల నిమ్మని యాచించుటకు మొదలిడిన, అభిజ్ఞాధికారుల కష్టము దేవునికే యెఱుక. ఒక్కడు నూరుమందికి దక్షిణ పెట్టుటకన్న, నూరుమంది ఒక్కనినుండి వెలయిచ్చి కొనుట సుగమ మని మనవారెఱిగి వర్తింతురుగాక!

# నైజాము రాష్ట్రమందలి ఆంధ్ర గ్రంథాలయములు

(నీలగిరి పత్రికయందు శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారు ఇటుల వ్రాయుచున్నారు.)

మనదేశమందిప్పుడు పనిచేయుచున్న గ్రంథాలయములు రెండు విధములుగా నున్నవి: (1) ఆంధ్రజన సంఘమువలన నడుపబడుచున్నవి. (2) విడిగా గ్రంథాలయములుగా నడుపబడుచున్నవి. మొదటి పద్ధతివి గడచిన రెండు సంవత్సరముల కాలములో హైదరాబాదునందలి ఆంధ్రజనసంఘ సభాసదుల యత్నమువలన గాని కేంద్రసంఘమువారి యత్నమువలనగాని స్థాపితములైనవి. ఇక రెండవతెరగతివానిలో గొన్నిమాత్రము చాలకాలముక్రిందటనే ఏర్పడినవి. ఆకాలమున ఆంధ్రజన సంఘము లనున వింకను ఆరంభముకాలేదు. మిగిలినవి ఇటీవల స్థాపితములైనవే కాని అవి గ్రంథాలయములుగానే యారంభమైనవి. ఆయాస్థలములలోనుండు ఉత్సాహవంతులగు యౌవనులకృషివలన అస్తిత్వమునకు వచ్చినవి. ఇతరస్థలమునందలి గ్రంథాలయములతోగాని, సంఘములతోగాని వానికి ఎట్టి సంబంధమును లేదు.

ఆంధ్రజనసంఘమువలన నడుపబడుచున్న (మొదటివిధమునకు చెందిన) గ్రంథాలయములస్థితినిగూర్చి విచారింతము. వీని సంఖ్య ఇప్పుడు షుమారు ౪౦ అని

చెప్పవచ్చును. ఇవి సంఘసంబంధములగుటచేత వీని యోగక్షేమములను, స్థితిగతులను తెలిసికొను భారము కొంతవరకు జిల్లాసంఘముపైనను మరికొంతవరకు కేంద్ర సంఘముపైనను కలదు. వీనినుండి ప్రతిమూడుమాసముల కును త్రైమాసిక నివేదికయను దానిని కేంద్రసంఘము వారు తెప్పించుకొనుచున్నారు. ఇందువలన వీని యాదాయ వ్యయములును వీని సభలు మున్నగు వాని వివరములును, కేంద్రసంఘమునకు తెలియు నవకాశము కలుగుచున్నది. జిల్లా సంఘము లింకను బాగుగా కుదురలేదు. ఆ విషయమున త్వరలో ప్రయత్నములు జరుగనున్నవి. అట్టి జిల్లాసంఘములు క్రమముగా నేర్పడి స్థానికసంఘములు తమ కర్తవ్యములను ఎరింగినచో ఒకజిల్లాలోనున్న అన్ని సంఘములకు మొదటను రాజ్యమునందలి సంఘములకు తరువాతను సమీప సంబంధ మేర్పడును. అనగా సంఘములవలన నడుపబడుచున్న గ్రంథాలయముల యోగక్షేమములు బాగుగా నారయబడును. ఈ పరస్పరసంబంధమువలన కార్యోత్సాహము హెచ్చవచ్చును. అన్యోన్యసహాయము నియమబద్ధత్వము, ఉత్తరవాదిత్వ భావము పొడ చూపవచ్చును. ఉద్దేశములయొక్కయు కార్యవిధానము యొక్కయు కేంద్రీకరణమునకు మంచిమార్గ మేర్పడును. సంఘములక్రిందనుండు వివిధవిద్యాసంస్థలకును అభిప్రాయసామ్యత, ఆదర్శసామ్యత కలుగును. ఇది అత్యవసరమగు కార్యమని చెప్పవలసినపనియే లేదు.

విడివిడిగా పనిచేయు గ్రంథాలయములలో హైదరాబాదునందలి శ్రీకృష్ణదేవరాయల ఆంధ్రభాషా నిలయము, సికింద్రాబాదునందలి ఆంధ్రసంవర్ధనీ వంటి సంస్థలకు అంతగా బాధలేదు. హనుమకొండ, వరంగల్లునందలి గ్రంథాలయములవంటి సంస్థలు వర్ధిల్లగలవు గాని సాధారణ గ్రామములందలి గ్రంథాలయముల యభివృద్ధిమాత్రము కొంత చిక్కులకు లోబడి యుండునని మాయభిప్రాయము. విడి గ్రంథాలయములనుగూర్చి ఇతర స్థలములవారికి సమాచారములు తెలియుటయే కష్టము. అట్టి గ్రంథాలయమున్నదో లేదో స్పష్టపడజాలదు. యోగక్షేమములు తెలిసికొను పరస్థానికులు లేనందున కార్యనిర్వాహకులకు నిరుత్సాహము కలుగుట అసాధారణ కార్యముకాదు. కొన్నిసారులు గ్రంథాలయ నిర్వాహకులనదగు వారొకవ్యక్తియే యై యుండవచ్చును. అట్టి వ్యక్తి స్థలాంతరమునకు బోవుటయో, నిరుత్సాహపడి వదలుకొనుటయో సంభవించినచో కార్యము మూలబడ వచ్చును. సభాసదులలో కొన్నిమారులు వైరములు కలిగి సంస్థ నిద్రపోవచ్చును. ఏకారణముచేతనేమి గ్రంథాలయకార్యములు సాగకపోయినను ఆసమాచారము మరియొక గ్రామమువారికి తెలియుటకే అవకాశము లేకుండపోవచ్చును. ఇవి కేవల మూహాజనితములగు సిద్ధాంతములు కావు. గడచిన 18 సంవత్సరములలో నాకు విద్యాసంస్థలను గూర్చి కలిగినయనుభవము ఇట్టివి ఎన్నియో యంశములను బోధించినది.

పై అంశములను ఆలోచించినచో మన గ్రంథాలయములన్నియు ఒక అంగనిర్మాణమునకు లోబడియుండినచో వీనిస్థిరత్వమునకు మంచి యవకాశములు ఏర్పడగలవు. కార్య విధానమందు సమత్వము పొడచూపగలదు. కనుక విడివిడిగా నున్న గ్రంథాలయముల నడపు సంఘములవారు ఈవిషయమున నాలోచించి కర్తవ్యము నిర్ణయించుట ఉత్తమము. కార్యము అంతకఠినమైనది కాదు. కావలసిన మార్పు నామమాత్రమే కాని మరేమియు లేదు. ఉదాహరణార్థము గోవిందాపురమునందొక గ్రంథాలయము "వేంకటేశ్వర భాషానిలయ" మను పేరుగలదియున్నదనుకొందము; అది విడిగా స్థాపితమైయున్నదని యూహింతము; దానినడుపుచున్నవారు కొందరా గ్రామమున నున్నారుకదా. వారుతమ్ముదాము గ్రంథాలయ సంఘమనుకొనుటకు మారుగా "నిజాంరాష్ట్రాంధ్రజనసంఘము - గోవిందాపురము" అని పేరొక్క నిరేని వారు కేంద్రసంఘముయొక్కయు జిల్లాసంఘముయొక్కయు అంగనిర్మాణమునకు లోబడెదరు. తమ గ్రంథాలయముయొక్క పేరును మార్చుకొనవలసిన పని లేదు; ఎప్పటిచందాలనే ప్రోవుచేసికొనవచ్చును; ఎప్పటి కార్యములనే జరుపవచ్చును; క్రొత్తకర్తవ్యమేదియు లేదు. క్రొత్తవారి యాజమాన్యము కలుగదు. కేంద్రసంఘము జిల్లాసంఘములతో అట్టిసంఘమునకు సంబంధ మేర్పడును. మూడుమాసములకొకసారి దాని స్థితిగతుల తెలుపు వివరణ పత్రికను కేంద్రసంఘము తెప్పించుకొనగలదు. జిల్లాసంఘ మేర్పడినవెంటనే వారు దీని క్షేమము నారయవలసిన వారగుదురు. అట్టిసంస్థకు జిల్లాసంఘమునను, దానిద్వారా కేంద్రసంఘమునను ప్రాతినిధ్యము లభించును. చిక్కు చిక్కుమనుచున్న విశిసంస్థకాక, అది స్వాతంత్ర్యవంతము సబలమునునగు సంఘముయొక్క దళమువచ్చి పది సంఘములతో సమత్వమును సంపాదించి గొప్పయుపయోగకారియగు యంత్రముయొక్క ముఖ్యచక్రములలో నొకటియైన చిరస్థాయిగ వర్ధిల్లగలదు.

19

# గ్రంథాలయోద్యమము

గ్రంథకర్త: యూతగిరి లక్ష్మీ వేంకటరమణ

## వెల రు 0—8—0

ఇందు 1. ధర్మ గ్రంథాలయ స్థాపన. 2. ధర్మ గ్రంథాలయ పాలనము. 3. ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమము. 4. ప్రాచీన గ్రంథాలయములు — హిందూ దేశము. 5. బరోడా గ్రంథాలయోద్యమము—ఉద్యమ ప్రారంభము. 6. బరోడా గ్రంథాలయోద్యమము — కేంద్ర గ్రంథాలయము. 7. బరోడా గ్రంథాలయోద్యమము — ఉద్యమ నిర్మాణము. 8. గ్రంథాలయోద్యమము — విదేశ గ్రంథాలయములు. 9. గ్రంథాలయోద్యమము — ఇంగ్లాండు దేశము. 10. గ్రంథాలయోద్యమము — అమెరికా సంయుక్త రాష్ట్రములు— అను పది అధ్యాయము లున్నవి.

గ్రంథాలయోద్యమమునుగూర్చి విపులముగా దెలుపునట్టి గ్రంథము. బరోడా గాయక్వారుగారి పటము ఇందుగలదు. ప్రతిగ్రంథాలయమును, గ్రంథాలయోద్యమాభిలాషియు తప్పక చదువవలసినది.

వలయువా రిట్లు వ్రాయవలెను:—

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము,

బెజవాడ.

RSVM01 A 126

20

మీకేపుస్తకము కావలసినను

# వేంకటరామ కంపెనీ.

## పుస్తకముల షాపు

# బెజవాడ

అని వ్రాయవలెను

---

# ఫ్రెండ్సు కంపెనీ, బెజవాడ.

## మా కంపెనీ క్రొత్తడాబాలోనికి మార్చబడినది

అన్నివస్తువులు సరసమైన ధరలకు కావలయుననిన ఫ్రెండ్సు కంపెనీ కొకసారి దయచేయుడు. ఫౌంటెన్ పేనాలకు, తలనూనెలకు, సెంటులకు, తెలుగు పుస్తకములకు, సిగారులైటులకు, యెలెక్ట్రిక్కు దీపములకు, లేసులకు, పన్నీరుబుడ్లకు, గ్లాసుసామానులకు ఫ్రెండ్సు కంపెనీకే వెళ్ళుడు.

---

# తొట్టివైద్యము.

కూనెగారి "అభినవవైద్యశాస్త్రము, ముఖవైఖరీవిద్య, రోగారోగ్యవివేకము, శిశుపోషణ" అను 4 గ్రంధములలోని సంగతులన్ని సులభశైలిని వ్రాయబడినది. తొట్టెస్నానములను గురించి వేఱొకగ్రంధము చదువనక్కరలేదు. 7 సంపుటములు. 36 అధ్యాయములు. 400 పుటలు. చక్కనిబైండు. వెల ౩-0-0. (పత్రికృతి చందాదారులకు 2-8-0)

అడ్రెసు:—

మేనేజరు,

పత్రికృతి ఆఫీసు, బెజవాడ.

---

ఆంధ్రగ్రంథాలయ ప్రెస్ (లిమిటెడ్) యందు
క, కోదండరామయ్యగారిచే ముద్రించి ప్రకటింపబడినది.

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVMO1 A 106 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 7/6/12 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 23 |
| పెద్ద సైజు పేజీలు | No |
| ఖాళీ పేజీలు | 1, |
| లేని పేజీలు | No |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | Sandhya |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | PRAGATHI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | No |
| పరిస్థితి | good |